# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహా కుంభమేళా లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పుణ్యస్నానం ఆచరించారు.**

2. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు శాఖలపై ఈరోజు సమీక్ష నిర్వహించనున్నారు.**

3. **ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో సమావేశమయ్యారు.**

4. **అనంతపురంలో ఈరోజు అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమం జరుగుతోంది.**

5. **జాతీయ క్రీడలలో రాష్ట్రం తరపున పతకాలు సాధించిన విజేతలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.**

=============================

ఉత్తరప్రదేశ్ లో జరుగుతున్న మహా కుంభమేళా లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం గంగానదికి హారతి ఇచ్చి, పూజలు నిర్వహించారు. ఈరోజు ఉదయం ప్రయాగ్‌రాజ్ చేరుకున్న ప్రధానమంత్రి అరైల్ ఘాట్ నుంచి బోటులో ప్రయాణిస్తూ స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు అభివాదం చేశారు. ప్రధానమంత్రి వెంట ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. జనవరి 13 వ తేదీణ ప్రారంభమైన మహా కుంభమేళాకు మన దేశంతో పాటు విదేశాల నుంచి భారీసంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఫిబ్రవరి 26 వరకు ఈ వేడుక జరగనుంది. ఇప్పటివరకు 38 కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

--------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి లోని రాష్ట్ర సచివాలయం నుంచి ఈరోజు పలు ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించిన అనంతరం రాష్ట్రంలో ఎలెక్ట్రిక్ బస్సుల కొనుగోలు, వినియోగం, నిర్వహణ పై అధికారులతో సమీక్షా సమావేశం జరుపుతారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొననున్నారు.

--------------------------

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలను పాటించాలని తిరుపతి ప్రాంతీయ రవాణా అధికారి కె.మురళీమోహన్ తెలిపారు. తిరుపతిలోని ఆర్టీఓ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ జనవరి నెల 16 వతేదీ నుండి ఈ నెల 15 వ తేదీ వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా

మాసోత్సవాలలో భాగంగా వాహనదారులకు పలు అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నామని.తెలుపుతూ..

(వాయిస్.32.)

---------------------------

వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా కలుషిత నీరు సరఫరా కాకుండా దెబ్బతిన్న పైపులను గుర్తించి మరమ్మతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలో నిన్న వైద్య ఆరోగ్య, విద్యా శాఖల అధికారులు సమావేశమై కలుషిత నీటి సరఫరా, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, మున్సిపల్ శాఖ సంబధిత అధికారులు పాల్గొన్నారు.

---------------------------

ఉధ్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయం, ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈరోజు అనంతపురంలో ఉద్యాన సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు జిల్లా కు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పలు జాతీయ అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంపొందించడం, రెండింతలు ఆదాయం రైతుకు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సందర్భంగా అరటి, టమాటా, మిరప, మామిడి. ఉత్పత్తుల ఎగుమతులు, రవాణా విధానాలపై చర్చలు, సహకార ఒప్పందాలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

---------------------------

పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా వైయస్సార్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని పలు విభాగాలను జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ నిన్నపరిశీలించారు. పోలీస్ ట్రాన్స్ పోర్ట్ విభాగం అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ వెల్ఫేర్ స్టోర్స్ సూపర్ మార్కెట్ ను సందర్శించి నాణ్యమైన వస్తువులను పోలీసులకు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ జిమ్ ను పోలీస్ సంక్షేమ ఆస్పత్రి ని పరిశీలించారు.

---------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగు తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రానికి డిఫెన్స్ రంగ పరికరాల తయారీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కొన్ని యూనిట్లు వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామ ని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పలువురు పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు.

---------------------------

నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈరోజు దేశవ్యాప్తంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వాటర్‌షెడ్ యాత్రను ప్రారంభిస్తారు. “జల్ లాయే ధన్-ధాన్య” అనే ఇతివృత్తంతో జరిగే ఈ సామూహిక ప్రచారం దాదాపు 60-90 రోజుల పాటు 26 రాష్ట్రాలు, రెండు

కేంద్రపాలిత ప్రాంతాలలోని 805 ప్రాజెక్టులలో ఉంటుందని అధికారులు తెలిపారు. నిన్న న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ప్రచారంలో ఎక్కువ మంది భాగస్వాములు కావలసిన అవసరం ఉందన్నారు. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన 2.0లో భాగమైన ఈ ప్రచారం వ్యవసాయం, జీవనోపాధి, పర్యావరణ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో స్థిరమైన సహజ వనరుల నిర్వహణ పాత్రను తెలియజేస్తుంది.

---------------------------

రాష్ట్రంలో పదో తరగతి ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 17 నుంచి 28 వతేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

---------------------------

ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు కీలక దశ అని.. మంచి మార్కులు సాధించి ఉన్నత కోర్సుల దిశగా అడుగులు వేయాలని ఎన్. టి. ఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. విజయవాడలోని కస్తూరిబాయి పేట సాంఘిక సంక్షేమ వసతి గృహాని నిన్న రాత్రి కలెక్టర్ పరిశీలించారు. ప్రతిఒక్కరిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఈ సందర్భంగా వసతి గృహ అధికారులను ఆదేశించారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలని, ప్రత్యేక శ్రద్ధపెట్టి విధ్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగువపరచాలన్నారు.

---------------------------

ఉత్తరాఖండ్ లో జరుగుతున్న జాతీయ క్రీడలలో రాష్ట్ర క్రీడాకారులు నిన్న రెండు కాంస్యాలు గెలుచుకున్నారు. మహిళల కనోయ్ స్లాలమ్ (సీ-1)లో దొడ్డి చేతన భగవతి మూడో స్థానంలో నిలవగా బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ లో కర్రి సాయిపవన్ షేక్ గౌస్ జోడీ కూడా కాంస్యం సాధించింది. అదే విధంగా ఈరోజు జరిగిన కాంపౌండ్ సింగిల్ ఈవెంట్‌లో నెల్లూరుకు చెందిన టి. గణేష్ మణిరత్నం కాంస్య పతకం సాధించారు. జాతీయ క్రీడలలో అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అభినందించారు.

---------------------------

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో 6 వేల ఎకరాల్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ 96 వేల 862 కోట్ల రూపాయలతో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. నిన్న రాజ్యసభలో తెలుగు దేశం పార్టీ పార్లమెంటు సభ్యులు బీదమస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ ఏటా 9 నండి 12 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు.

---------------------------

బుర్రకథా పితామహుడు షేక్ నాజర్ జయంతి ఈరోజు.గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో 1920 ఫిబ్రవరి 5వ తేదీన ఆయన జన్మించారు. పల్నాటియుద్ధం, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, బెంగాల్ డొక్కల కరువు మొదలైన ఇతి వృత్తాలతో సమకాలీన రాజకీయాలను జోడించి బుర్రకథలు రూపొందించి ఆయన

ప్రదర్శించారు. తెలుగువారి సాంస్కృతిక జీవనంలో ప్రముఖస్థానం వహించిన కళారూపం బుర్రకథకు గౌరవం కల్పించి ప్రజా కళగా తీర్చిదిద్దిన నాజర్ కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. 1986లో కేంద్ర ప్రభుత్వం నుండి పద్మశ్రీ బిరుదును పొందిన షేక్ నాజర్ 1997 ఫిబ్రవరి 21వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

గత నెల 22 నుంచి 29 వతేదీ వరకు జరిగిన జేఈఈ మెయిన్స్ తొలివిడత పేపర్-1 పరీక్షల ప్రాథమిక 'కీ' నిన్న విడుదలైంది. దీనిపై అభ్యంతరాలను రేపు రాత్రి 11 గంటల 50 నిమిషాల లోపు పంపవచ్చని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) తెలిపింది. విద్యార్థుల రెస్పాన్స్ షీట్లను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది.

======================